# ఇంజనీరింగ్ యాజమాన్య కోటా సీట్ల భర్తీకి షెడ్యూల్

రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీల్లో యాజమాన్య కోటా సీట్ల భర్తీకి ఉన్నత విద్యామండలి గురువారం షెడ్యూల్ ప్రకటించింది. ఈనెల 19 నుంచి ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమవుతుండగా.. ఆగస్టు 10 వరకు సీట్ల భర్తీ చేసుకునే అవకాశం కల్పించింది. అర్హత, ఎంపిక విధానానికి సంబంధించి మార్గదర్శకాలు విడుదల చేశామని మండలి అధ్యక్షుడు ఆచార్య బాలకిష్టారెడ్డి చెప్పారు. మరిన్ని వివరాల కోసం కళాశాలల అధికారిక వెబ్‌సైట్ సందర్శించాలని సూచించారు. కాగా, ప్రైవేటు కాలేజీల్లో 70శాతం సీట్లను ప్రతిభ ఆధారంగా భర్తీ చేస్తుండగా, మిగతా 30శాతం సీట్లను యాజమాన్య కోటా ద్వారా భర్తీ చేస్తారు.





# ఐదేళ్లలోనే బీటెక్, ఎంఎస్ పూర్తి

- స్థానికంగా మూడున్నరేళ్లు, స్వీడన్‌లో ఏడాదిన్నర
- బీటీహెచ్‌తో జేఎన్‌టీయూ ఒప్పందం
- నాలుగు కోర్సుల్లో 80 సీట్లకు 146 దరఖాస్తులు
- ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు నేడు తుదిగడువు
- 23న కౌన్సెలింగ్

హైదరాబాద్ సిటీ, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్లకే బ్యాచిలర్ ఆఫ్ టెక్నాలజీ (బీటెక్) తో పాటు మాస్టర్ ఆఫ్ సైన్స్(ఎంఎస్) కూడా పూర్తి చేసే అవకాశాన్ని జేఎన్‌టీయూ కల్పిస్తోంది. స్వీడన్‌లోని బ్లెకింగ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(బీటీహెచ్)తో చేసుకున్న అవగాహన ఒప్పందం (ఎంఓయూ) మేరకు ఇంటిగ్రేటెడ్ డబుల్ డిగ్రీ మాస్టర్స్ ప్రోగ్రామ్ (ఐడీడీఎంపీ)ను జేఎన్‌టీయూ నిర్వహిస్తోంది. ఈనెల 8న నోటిఫికేషన్ జారీ కాగా, ఇప్పటికే 146 దరఖాస్తులు అందినట్లు అడ్మిషన్ల విభాగం అధికారులు తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు శుక్రవారంతో గడువు ముగియనుంది. చివరి రోజు దరఖాస్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు. కాగా, ఐదేళ్ల ఐడీడీఎంపీ కోర్సులో చేరే విద్యార్థులు మూడున్నరేళ్ల పాటు జేఎన్‌టీయూలో, ఏడాదిన్నర పాటు స్వీడన్‌లోని బీటీహెచ్ యూనివర్సిటీలో చదువుకోవాల్సి ఉంటుంది. అతితక్కువ వ్యయంతో స్వీడన్‌లో ఎంఎస్‌ను పూర్తిచేసే అవకాశం కావడంతో ఐడీడీఎంపీ కోర్సులకు డిమాండ్ ఏర్పడింది. ఐడీడీఎంపీ కోర్సు పూర్తిచేసిన వారికి స్వీడన్‌లో ఉద్యోగం చేసేందుకు వీలుగా బీటీహెచ్ యూనివర్సిటీ నుంచి ఎంఎస్ సర్టిఫికెట్ ఇస్తుండగా, ఇండియాలో ఉద్యోగం చేయాలనుకునే వారికి జేఎన్టీయూ బీటెక్‌తో పాటు ఎంటెక్ సర్టిఫికేట్ కూడా అందిస్తుండడం విశేషం.

**కోర్సులు.. ఫీజులు**

ఐడీడీఎంపీ(బీటెక్‌తో పాటు ఎంఎస్) ప్రోగ్రామ్‌లో మొత్తం 4 కోర్సులు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(సీఎస్ఈ), ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషీన్ లెర్నింగ్ (ఏఐఎంఎల్), సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ (ఈసీఈ)కోర్సులున్నాయి. ప్రతి కోర్సులోనూ 20 సీట్ల చొప్పున మొత్తం 80 సీట్లుండగా, ఆయా కోర్సుల్లో 30శాతం సీట్లను జేఈఈ మెయిన్స్ ర్యాంకర్లకు, 70 శాతం సీట్లను టీజీఎప్‌సెట్ ర్యాంకర్లకు కేటాయించారు. అభ్యర్థులకు 12వతరగతి/ఇంటర్ 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలి. ఐడీడీఎంపీ కోర్సు చదివేందుకు జేఎన్‌టీయూలో సెమిస్టర్‌కు రూ.1.25లక్షల చొప్పున ఏడు సెమిస్టర్లకు రూ.8.75లక్షలు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. అలాగే, స్వీడన్‌లో మూడు సెమిస్టర్లు చదవాల్సి ఉండగా, ఒక్కో సెమిస్టర్‌కు 52,500 స్వీడన్ డాలర్లు (సుమారు రూ.4.15లక్షలు) చొప్పున మూడు సెమిస్టర్ల పాటు ఫీజు చెల్లించాలి. ఐడీడీఎంపీ పూర్తిచేస్తే స్వీడన్‌లోని ప్రముఖ కంపెనీల్లో ప్లేస్‌మెంట్స్ లభిస్తున్నాయని వర్సిటీ అధికారులు చెబుతున్నారు.

**మెరిట్ ప్రాతిపదికన ప్రవేశాలు**

ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించిన అభ్యర్థులకు ఈ నెల 23న ఉదయం 10.30 గంటల నుంచి కౌన్సెలింగ్ నిర్వహించి మెరిట్ ప్రాతిపదికన ప్రవేశాలు కల్పిస్తాం. జేఎన్‌టీయూ నిర్వహిస్తున్న స్వీడన్ తరహా ఎంఓయూ కోర్సులకు తెలంగాణతో పాటు ఏ రాష్ట్రానికి చెందిన వారైనా దరఖాస్తు చేసుకోవచ్చు.

- బాలు నాయక్ అడ్మిషన్ల విభాగం డైరెక్టర్

